సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 6 । ఏప్రిల్ । 2025



పంట పోయింది!

కూరగాయల పంటల సాగుతో లాభాలు వస్తాయని ఆశించిన రైతులకు సాగు నీటి కష్టాలు ఎదురయ్యాయి. 8లో▸



యూరియా లారీ బోల్తా

యూరియా లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన శనివారం అల్వాలలో చోటు చేసుకుంది. 8లో▸



రాజ్యాంగ పరిరక్షణ

రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ ముందుకు వెళ్తోందని దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. 8లో▸

సయోధ్యకు సై

'ఫ్యూచర్'కు అడ్డంకులు ఉండొద్దని భావిస్తున్న ప్రభుత్వం

- ఎకరాకు రూ.50లక్షలకు పైగా పరిహారం ఇచ్చేందుకు ప్రతిపాదనలు
- వారంలో తేలనున్న ప్లాట్ల లాటరీ తేదీలు



ఫ్యూచర్‌సిటీకి పక్కగా సర్వే, ఫెన్సింగ్ చేపడుతున్న అధికారులు

యాచారం: ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి అడ్డంకులు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రైతుల సయోధ్యతోనే నాలుగో నగరిని నిర్మించేందుకు దృష్టి సారించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా ఉండేందుకు ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందులో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీకి సేకరించాల్సిన 19,333 ఎకరాల్లోనే నయానగరిని నిర్మించేందుకు యోచిస్తోంది. ఇప్పటికే రైతులకు పరిహారం ఇచ్చి సేకరించిన 14 వేల ఎకరాల్లో ప్రముఖ సంస్థలకు భూములు అప్పగించేందుకు దృష్టి పెట్టింది. గత బీఆర్‌ఎస్ హయాంలో ఫార్మాసిటీకి సేకరించిన భూములపై పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు నాలుగేళ్లుగా సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో భూములను ప్రముఖ సంస్థలకు అప్పగించే సమయంలో రైతుల నుంచి సమస్యలు రాకుండా భూముల సర్వే చేపట్టి ఫెన్సింగ్ పనులు చేపడుతున్నారు. రైతులు అడ్డుకోకుండా బందోబస్తు నడుమ ఈ పనులు కొనసాగిస్తున్నారు.

శాశ్వత పరిష్కారానికి చర్యలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల నుంచి 10 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూమిని సేకరించడానికి నిర్ణయించి 7,640 ఎకరాలను సేకరించగా.. మరో 2,200 ఎకరాల పట్టా భూముల రైతులు తమ భూములు ఫార్మాకు ఇచ్చేది లేదని అప్పట్లోనే కోర్టును ఆశ్రయించారు. దీంతో అధికారులు రాత్రికి, రాత్రే రైతుల పేర్లపై అవార్డులు పాస్ చేసి భూరికార్డులను టీజీఐఐసీ పేరు మార్చేసి, పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేశారు. ఈ 2,200 ఎకరాల పట్టా భూమి ఇప్పటికే సేకరించిన భూముల మధ్య ఉంది. ప్రస్తుతం 2,200 ఎకరాల పట్టా భూమిని ఎలా సేకరించాలనే విషయమై సర్కార్ యోచిస్తోంది. రైతులతో ఎలా సయోధ్య కుదుర్చుకోవాలి. పరిహారం విషయమై సమాలోచనలు చేస్తున్నారు. ఈ మధ్యనే కుర్మిద్ద గ్రామంలోని 294,295, 296, 312 సర్వేనంబర్లలోని 40 ఎకరాలకు పైగా పట్టా భూమికి ఎకరాకు అధికారికం, అనధికారికం కింద రూ.45 లక్షలకు పైగానే పరిహారం ఇచ్చారు. ఎకరాకు 121 గజాల ప్లాటు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అదే మాదిరి పరిహారం ఇస్తే కోర్టు కేసులున్న 2,200 ఎకరాల పట్టా భూమిని రైతులు ఇచ్చేస్తారా.. అని అధికారులు ఆలోచన చేస్తున్నారు. త్వరలో కోర్టు కేసులున్న రైతులతో సమావేశానికి అధికారులు రెడీ అవుతున్నారు. కోర్టు కేసులున్న 2,200 ఎకరాల భూమిని సేకరిస్తే తప్పా ఫ్యూచర్‌కు మార్గం సుగుమం కాదనే భావనతో అధికారులు ఉన్నారు. సర్కార్ ఇచ్చే పరిహారంతో పాటు ఫ్యూచర్ కంపెనీలతో మరికొంత పరిహారం ఇప్పించి రైతులను శాంతింప చేయాలని అధికారులు నిర్ణయించి సర్కార్‌కు ప్రతిపాదనలు పంపారు.

ప్లాట్ల కేటాయింపునకు ఏర్పాట్లు

నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఫార్మా భూములకు ఫెన్సింగ్ వేసే సమయంలో భూములు ఇచ్చిన రైతులు ఫార్మా ప్లాట్ల స్థలం ఎప్పుడు చూపుతారని అధికారులను నిలదీస్తున్నారు. ఫెన్సింగ్ వేసిన తర్వాత ప్లాట్ల సర్టిఫికెట్లు ఇవ్వకపోతే ఎలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మీర్‌ఖాన్‌పేటలోని 620 ఎకరాల్లో టీజీఐఐసీ మెగా వెంచర్‌లో ప్రస్తుతం అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే రైతులకు పంపిణీ చేసి ప్లాట్ల నంబర్ల ఆధారంగా వెంచర్‌లో హద్దు రాళ్లు పాతి, నంబర్లు సైతం వేశారు. యాచారం కందుకూరు మండలాల్లోని 7 వేల మందికి పైగా రైతులకు ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఫార్మా భూముల్లో కొందరు నకిలీలు ఉన్నారనే విషయాన్ని అధికారులు గుర్తించారు. వారి పేర్లను లిస్టుల్లోంచి తీసేసినట్లు తెలిసింది. సర్కార్ ఆదేశాలు ఇచ్చిన వెంటనే భూములిచ్చిన రైతులకు లాటరీ ద్వారా ఫార్మా ప్లాట్లు కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎంఓ నుంచి రెండు, మూడు రోజుల్లో సమాచారం వస్తే వారం, పది రోజుల వ్యవధిలోనే లాటరీ తేదీలు రైతులకు తెలియజేస్తామని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. ఫార్మా ప్లాట్ల కబ్జా చూపిస్తే ఫెన్సింగ్ నిర్మాణంలో రైతుల నుంచి వ్యతిరేకత పూర్తిగా తగ్గే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ఎర్లీబర్డ్'కు బోణీ

మొదట చెల్లించిన వ్యక్తికి సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న మున్సిపల్ అధికారులు

షాద్‌నగర్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించిన ఇంటి యజమానిని శనివారం మున్సిపల్ అధికారులు ఘనంగా సన్మానించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం కింద ఐదు శాతం రాయితీ కల్పిస్తుంది. పట్టణంలోని ఈశ్వర్ కాలనీకి చెందిన పాతూరి సత్యనారాయణ రూ.1.46లక్షల ఆస్తి పన్ను చెల్లించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సునీత, అధికారులు ఆయన్ను శాలువాతో సన్మానించారు.

గౌడ కులస్తుల అభివృద్ధికి ఐక్యతతో పనిచేయాలి

గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు కృష్ణగౌడ్



దర్శన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

మొయినాబాద్: గౌడ కుల అభివృద్ధికి కులస్తులంతా ఐక్యతతో పనిచేయాలని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్ అన్నారు. మొయినాబాద్‌కు చెందిన రేనట్ల దర్శన్‌గౌడ్ సంఘం జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా శనివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణగౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. గౌడ సదస్సులు నిర్వహించి కులస్తులను ఏకం చేయాలన్నారు. అనంతరం దర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని.. గౌడ కుల అభివృద్ధి, ఐక్యతకోసం పనిచేస్తానని చెప్పారిర్తీ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేనట్ల మల్లేశ్‌గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మహేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నర్సింహగౌడ్, మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్, నాయకులు సతీశ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, లావణ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఫెన్సింగ్ పనులను నిలిపివేయాలి'

యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫెన్సింగ్ పనులను ఆపివేయాలని.. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సీపీఎం నక్కర్తమేడిపల్లి శ్రేణులు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం వారు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసైన్డ్ పట్టాలున్న రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని ఆరోపించారు. రైతులను అడ్డుకుని ఫెన్సింగ్ పనులు చేపట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం గ్రామాలను పోలీసులతో మోహరించి ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని మండిపడ్డారు. ఫెన్సింగ్ పనులను నిలిపివేయకపోతే ఫార్మా బాధిత గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి రైతులను చైతన్యం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య, నాయకులు ఆలంపల్లి జంగయ్య, జహంగీర్, యాదయ్య, భూషన్, పెంటయ్య, శ్రీకాంత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిన్న సీజ్.. నేడు ఓపెన్

క్లినిక్‌లపై వైద్యాధికారుల వరుస దాడులు



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

షాద్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా షాద్‌నగర్ పట్టణంలో నిర్వహిస్తున్న పలు క్లినిక్‌లను శుక్రవారం సాయంత్రం వైద్యశాఖ అధికారులు సీజ్ చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆర్‌ఎంపీలు ఏర్పాటు చేసిన మనస్విని, ప్రజా వైద్యశాల, సిద్దాపూర్ దవాఖానా, రాజా మెడికల్ హాల్ వెనక ఉన్న క్లినిక్‌లపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టి వాటిని సీజ్ చేశారు. కాగా శుక్రవారం జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్ చేసిన క్లినిక్‌లను శనివారం ఆర్‌ఎంపీలు తెరిచారు. దీంతో స్థానిక అధికారులు శనివారం మళ్లీ సీజ్ చేశారు.

చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు

- రేపటి నుంచి 14 వరకు వేడుకలు
- ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం
- గరుడ ప్రసాద పంపిణీకి బ్రేక్



ఉత్సవ మూర్తులు



చిలుకూరు బాలాజీ ఆలయం

మొయినాబాద్: వీసా గాడ్‌గా పేరొందిన కలియుగ దైవం.. చిలుకూరు బాలాజీ స్వామి వారు బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతూ.. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన చిలుకూరు బాలాజీ ఆలయం వేడుకలకు ముస్తాబైంది. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రతీ సంవత్సరం శ్రీరామనవమి తరువాత దశమి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితి. ఈ నెల 7న సోమవారం సెల్వర్ కూత్తుతోఉత్సవాల అంకురార్పణ చేసి 14న చక్రతీర్థం ధ్వజావరోహణంతో ముగుస్తాయి.

చివరి దశకు చేరుకున్న ఏర్పాట్లు

చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చకచక కొనసాగుతున్నాయి. ఇప్పటికే స్వామి వారి రథం ఉత్సవాలకు ముస్తాబైంది. వాహన సేవలకు ఉపయోగించే వాహనాలు సిద్ధం చేశారు. ఆలయానికి రంగులు, సున్నం వేయించే పనులు చివరి దశకు చేరుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతీ శుక్రవారం గరుడ ప్రసాదం

బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం అనంతరం గరుత్మంతుడికి పెట్టే నైవేద్యాన్ని సంతానం లేని మహిళలకు ప్రసాదంగా వితరణ చేసేవారు. గత ఏడాది గరుడ ప్రసాదం కోసం పెద్ద సంఖ్యలో మహిళలు రావడంతో ఆలయ పరిసరాల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో గరుడ ప్రసాద పంపిణీ నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. సంతానం లేని మహిళలకు మే నుంచి ప్రతీ శుక్రవారం గరుడ ప్రసాదాన్ని సంతాన భాగ్య ప్రసాదంగా అందజేస్తామని చెప్పారు. గత ఏడాది సైతం ప్రతీ శుక్రవారం గరుడ ప్రసాదాన్ని అందించామన్నారు. ఈ నెలలో గరుడ ప్రసాదం పంపిణీ ఉండదని చెప్పారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

తేదీ	సేవలు
7న	సెల్వర్ కూత్తు
8న	ధ్వజారోహణం, శేషవాహన సేవలు
9న	గోపవాహన, హనుమంత వాహన సేవ
10న	సూర్యప్రభ, గరుడ వాహన సేవలు
11న	వసంతోత్సవం, గజవాహన సేవ
12న	పల్లకీ సేవ, అర్ధరాత్రి దివ్య రథోత్సవం
13న	మహాభిషేకం, ఆస్థాన సేవ, అశ్వవాహన, దోప్, పుష్పాంజలి సేవలు
14న	చక్రతీర్థం, ధ్వజావరోహణం

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



చిలుకూరు వేంకటేశ్వరస్వామి(బాలాజీ) బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన ధ్వజారోహణం, కల్యాణోత్సవం, రథోత్సవం, చక్రతీర్థం కార్యక్రమాల సందర్భంగా భక్తులకు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ సారి గరుడ ప్రసాదం పంపిణీ ఉండదు. సంతానం లేని మహిళలు గరుడ ప్రసాదం కోసం రావద్దు. మే నెల నుంచి ప్రతి శుక్రవారం గరుడ ప్రసాదం అందిస్తాం.

– రంగరాజన్, చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు

వ్యవసాయ రంగానికి తోడ్పాటు ఇవ్వాలి

కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య

చేవెళ్ల: వ్యవసాయ రంగానికి మద్దతుగా విద్యాసంస్థలు తమవంతు కృషి చేయాలని కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య సూచించారు. శనివారం నగరంలో మండల పరిధిలోని సాగర్ ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ స్కూల్ విద్యార్థుల పీజీ డిప్లొమా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మనాభయ్య మాట్లాడుతూ.. వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉండేందుకు సాగర్ గ్రూప్ వ్యవసాయ రంగ విద్యను అందించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించేందుకు యువ నిపుణులు కృషి చేయాలన్నారు. నూతన అవిష్కరణలను తీసుకురావాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సారగ్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ కేవీ రాజు, సంస్థల వ్యవస్థాపకుడు డబ్ల్యూ.రాంపుల్లారెడ్డి, డాక్టర్ మాలతిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌కు నగర బహిష్కరణ



సురేందర్(ఫైల్)

మీర్‌పేట: పలు హత్య కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న ఓ రౌడీషీటర్‌కు ఆరు నెలల పాటు నగర బహిష్కరణ విధిస్తూ రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆరాంఘర్‌కు చెందిన సురేందర్ అలియాస్ సూరి (36) రౌడీషీటర్. ఇతనిపై మీర్‌పేటతో పాటు పలు పోలీస్ స్టేషన్లలో సుమారు 40 కేసులు నమోదై ఉన్నాయి. ఏడాది క్రితం మీర్‌పేటలో సల్మాన్ అనే యువకుడిని హత్య చేయడంతో పాటు కట్టుకున్న భార్యను కూడా హతమార్చాడు. ఇటీవల చైతన్యపురి పీఎస్ పరిధిలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు ప్రయత్నించాడు. ఇతని వల్ల మరికొందరికి ప్రాణహాని ఉందని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు 261 సిటీ యాక్ట్ ప్రకారం సురేందర్‌ను నగర బహిష్కరణ చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. సురేందర్ కమిషనరేట్ పరిధిలో ఉండకూడదని, ఒకవేళ రావాలనుకుంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

దేశీయ విత్తనాలతో భూతాపానికి చెక్

- రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు మోహన్ గురుస్వామి
- రెండో రోజుకు చేరిన తెలంగాణ తొలి విత్తనాల పండుగ

కడ్తాల్: దేశీయ విత్తనాల అభివృద్ధితోనే భూతాపాన్ని తగ్గించుకోవచ్చని.. ఒక డిగ్రీ సెంటి గ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగితే 15 నుంచి 20 శాతం ఆహార ఉత్పత్తి తగ్గుతుందని ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు మోహన్ గురుస్వామి అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) పర్యావరణ సంస్థ–భారత్ బీజ్ స్వరాజ్‌మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎర్త్ సెంటర్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ తొలి విత్తన పండుగ శనివారం రెండో రోజుకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో, రైతులు, యువకులు, వ్యవసాయ రంగ నిపుణులు, పర్యావరణ వేత్తలు, ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు, పర్యావరణ వేత్తలు తరలివచ్చారు. సంప్రదాయ విత్తనాల ప్రదర్శన స్టాల్స్ సందర్శకులు, కొనుగోలు దారులతో సందండిగా మారాయి.

రైతాంగ సమస్యలపై దృష్టి సారించాలి

సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోహన్ గురుస్వామి మాట్లాడుతూ.. గడిచిన 50 ఏళ్లలో వ్యవసాయ రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. గతంలో 1.20లక్షలు ఉన్న వరి రకాల స్థానంలో నేడు కేవలం 3 వేల రకాల వంగడాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, సువాసన భరిత చిట్టి ముత్యాలు కనుమరుగయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తన పరిశోధనకు ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. మందిరం కంచ గచ్చిబౌలి, వక్ఫ్ బోర్డ్ అంశాల పట్ల ఉన్న శ్రద్ధ, రైతులు వాతావరణం, విత్తనాల అభివృద్ధి మీద పాలకులకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా రైతులు, రైతాంగ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

భూసారం తగ్గి రైతు ఆత్మహత్యలు

అనంతరం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థ నిర్వాహకులు గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచీకరణ కారణంగా వ్యవసాయం, దేశీ ఆవులు తగ్గాయన్నారు. తూర్పు కొండల పశువుల పాల ఉత్పత్తులతో మానవుల ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. భూముల్లో వానపాములు తగ్గడంతో భూసారం తగ్గి రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. సీజీఆర్ సంస్థ విత్తనాలతో విప్లవాత్మకమైన మార్పును తీసుకురావాలని కోరారు. స్వదేశీ ఆహారంతో కేన్సర్, షుగర్‌తో పాటు, వివిధ రోగాలను నివారించేలా సహకారం అందిద్దామని తెలిపారు. సీజీఆర్ సంస్థ పర్యావరణ రక్షణకు చేస్తున్న కృషిని ప్రశంసించారు.

ఆరోగ్యానికి ఆహార భద్రత

సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యానికి ఆహార భద్రత కల్పించడమే లక్ష్యంగా, విత్తన పండుగ నిర్వహిస్తున్నామన్నారు. సంప్రదాయ విత్తనాల వైభవాన్ని తెలియజేసేందుకు, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు వర్క్‌షాపులను సైతం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయ విత్తనాలను సంరక్షిస్తూ.. ప్రకృతి సంపదను భవిష్యత్‌తరాలకు అందించాలని కోరారు. విజయ్‌రామ్ నేచురల్ ఫార్మింగ్‌పై సభలో సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సూదిని పద్మారెడ్డి, పాలసీ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, పర్యావరణ నిపుణులు సాయి భాస్కర్‌రెడ్డి, సీజీఆర్ సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించాలి

స్థానిక సంప్రదాయ విత్తనాన్ని కాపాడుకుంటూనే సుస్థిర వ్యవసాయాన్ని కొనసాగించే పద్ధతులను అన్వేషించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ఆకట్టుకునేలా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, వ్యవసాయ రంగంలో జీవనోపాధి, ఆరోగ్యముందనే నమ్మకం వారిలో కలిగిస్తేనే, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోగలుగుతామన్నారు. అనంతరం ఎర్త్ సెంటర్‌లోని దేశీ విత్తన స్టాల్స్‌ను సందర్శించడంతో పాటు, లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యుడు కేవీఎస్‌రెడ్డి ఉన్నారు.



విత్తనాల పండుగ కార్యక్రమంలో మాట్లాడుతున్న మోహన్ గురుస్వామి

బండరాళ్లతో వ్యక్తిపై దాడి

- తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం
- మీర్‌పేట్ పీఎస్ పరిధిలో ఘటన
- పోలీసుల ప్రవర్తనపై మాజీ ప్రజాప్రతినిధి ఫిర్యాదు

మీర్‌పేట: గుర్తు తెలియని దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సంఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. మీర్‌పేటకు చెందిన పెండ్యాల విష్ణు (35)కు మూడేళ్ల క్రితం వివాహం కాగా, మద్యానికి బానిస కావడంతో భార్య వదిలేసింది. మలక్‌పేట యశోద ఆస్పత్రిలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నప్పటికీ కొంత కాలంగా విధులకు వెళ్లడం లేదు. డబ్బులు అవసరమైన ప్పుడల్లా స్థానికంగా చిన్నాచితక పనులు చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో జిల్లెలగూడ వార్డు కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు విష్ణుపై బండరాళ్లతో దాడి చేసి పారిపోయారు. రక్తపు మడుగులో ఉన్న బాధితుడిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో ఉస్మానియాకు తరలించారు. విష్ణు సోదరుడు ఈశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దాడికి పాల్పడిన వారి కోసం సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

ఇదేనా.. ఫ్రెండ్లీ పోలీసింగ్?

ఓ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని సమాచారం అందిస్తే మీర్‌పేట పోలీసులు ఆలస్యంగా రావడంతో పాటు తన పట్ల దురుసుగా వ్యవహరించారని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా..? అని జిల్లెలగూడకు చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జిల్లెల నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు తన ఇంటి ముందు జరిగిన సంఘటనపై మీర్‌పేట పోలీసులకు సమాచారం అందించగా, సమయానికి రాకపోవడంతో 100కు డయల్ చేశామని, వారు కంట్రోల్ రూం నంబర్ 112కు ఫోన్ చేయాలని సూచించడంతో.. కంట్రోల్ రూం నుంచి సమాచారం అందుకున్న పెట్రోలింగ్ సిబ్బంది 15 నిముషాల్లో వచ్చారని తెలిపారు. అంతకు ముందే తాను 108కు ఫోన్ చేయగా వారు రావడంతో గాయపడ్డ వ్యక్తిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించామన్నారు. సంఘటన జరిగిన గంటన్నర తర్వాత మీర్‌పేట పీఎస్ సిబ్బంది, ఓ పోలీసు అధికారి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వ్యక్తి సోదరుడు ఈశ్వర్‌ను ఆరాతీస్తుండగా, సంఘటన జరిగి చాలా సేపవుతోందని, బాధితుడికి తీవ్ర రక్తస్రావమైందని, ముందుగా అతని సోదరుడు ఈశ్వర్‌ను ఆస్పత్రికి పంపించాలని కోరినట్లు తెలిపారు. దీంతో సదరు పోలీసు అధికారి తన పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు కాలర్‌ను పట్టుకుని పోలీసు వ్యాన్ ఎక్కాలని బెదిరించినట్లు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మద్యం మత్తులో వచ్చిన పోలీసులు తనపై, మాజీ సర్పంచ్ అయిన తన భార్య వనిత పట్ల కూడా దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. దీనిపై తాను వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని స్పష్టంచేశారు. సంఘటనపై ఏసీపీకి పూర్తి వివరాలు తెలియజేశానన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. ఈ విషయంపై సీఐ నాగరాజును అడగగా.. నరేందర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. తమ సిబ్బంది సమయానికే వెళ్లి గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలించారని తెలిపారు.

రంగరాజన్‌పై దాడి కేసులో వీర రాఘవరెడ్డికి బెయిల్

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడైన వీర రాఘవరెడ్డికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రామరాజ్యం ఆర్మీ పేరుతో గత ఫిబ్రవరి 7న వీర రాఘవరెడ్డి, అతని బృందం 20 మంది చిలుకూరు ఆలయానికి వెళ్లి రంగరాజన్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మొయినాబాద్ ఠాణాలో కేసు నమోదవగా నిందితులను రిమాండ్‌కు తరలించారు. వీరిలో వీర రాఘవరెడ్డికి మినహా మిగిలిన 20 మందికి నెల రోజుల క్రితమే బెయిల్ దొరికింది. తన రిమాండ్‌ను సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. అయినా బెయిల్ మంజూరు కాలేదు. 56 రోజుల తర్వాత రాజేంద్రనగర్ కోర్టు వీరరాఘవరెడ్డికి బెయిల్ మంజూరు చేసింది.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కేశంపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసిన ఘటన శనివారం నిర్దవెల్లిలో చోటు చేసుకుంది. సీఐ నరహరి తెలిపిన ప్రకారం.. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గమనించి పత్రాలు తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో డ్రైవర్ మహేశ్‌ను స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కానిస్టేబుల్ శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాటు వివాదం : అట్రాసిటీ కేసు

షాద్‌నగర్: ప్లాటు వివాద ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. బైపాస్ రోడ్డులో ఓ ప్లాటుకు సంబంధించి బాబు నాయక్, జనార్దన్‌రెడ్డి మధ్య వివాదం జరుగుతోంది. ఆ ప్లాటులో బాబు నాయక్ నిర్మించిన ఇంటిని జనార్దన్‌రెడ్డి కూల్చివేయగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాబు నాయక్ ఫిర్యాదు మేరకు జనార్దన్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంట పోయింది!

- అడుగంటిన భూగర్భ జలాలు
- దిక్కుతోచని స్థితిలో ఉద్యాన రైతులు
- కూరగాయలు, ఆకుకూర పంటలకు అందని సాగు నీరు
- పెట్టుబడులు కూడా రాని దుస్థితి


చౌదర్‌పల్లి నీళ్లు అందక ఎండిపోయిన బీర తోట


వదిలేసిన టమాటా పంటను చూపిస్తున్న రైతు దంపతులు

యాచారం: కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాల్లో మునిగిపోతున్నారు. మంచి ధరలు ఉండటంతో అధిక లాభాలు వస్తాయని ఆశించిన వీరికి సాగు నీటి కష్టాలు ఎదురయ్యాయి. చేతికందే దశలో ఎండిపోతున్న పంటలు కర్షకులను పుట్టెడు దుఃఖంలోకి నెట్టాయి. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో యాసంగి సీజన్ కింద 2,119 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయ పంటలు, 500 ఎకరాల్లో ఆకుకూరలు సాగు చేశారు. ఇందుకోసం ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. అంటే సుమారు రూ.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు. పంటలు బాగా పండి మంచి ధర పలికితే రూ.50 కోట్లకు పైగానే ఆర్జించేవారు. కానీ అడుగంటిన భూగర్భ జలాలు వీరి ఆశలపై నీళ్లు చల్లాయి.

ఎండిపోతున్న పంటలు

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో రెండేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురవలేదు. దీంతో బోరుబావుల్లో ఉన్న కొద్ది నీటితో రైతులు స్వల్పకాలంలో చేతికొచ్చే బెండ, చిక్కుడు, కాకర, దోస, సోర, బీర, టమాటా తదితర కూరగాయల పంటలను సాగు చేశారు. దీర్ఘకాలికం కింద పుదీనా, స్వల్పకాలికం కింద కొత్తిమీర, పుంటికూర (గోంగూర) తదితర ఆకుకూరల పంటలు వేశారు. డివిజన్‌లోని ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, మాడ్గుల్, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల్లో దాదాపు మూడు వేల మందికిపైగా రైతులు కూరగాయలు, ఆకుకూరల సాగు పైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. అత్యధికంగా యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో పంటల సాగు చేస్తారు. ఎండల తీవ్రత దృష్ట్యా గడిచిన రెండు నెలల కాలంలో బోరుబావుల్లో భూగర్భజలాలు అమాంతం పడిపోయాయి. ఆరు నెలల కింద పుష్కలంగా నీళ్లు పోసిన బోరు బావులు వారం, పది రోజుల వ్యవధిలో పూర్తిగా తగ్గిపోయాయి. చేతికి వచ్చే దశలో ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి కొత్తగా బోరుబావులు తవ్విస్తే దుమ్ము తప్ప ఏమీ రావడం లేదు.

ధరలు మండే అవకాశం

మరో రెండు నెలల పాటు ఎండల తీవ్రత కొనసాగనుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బోర్లు, బావులు పూర్తిగా వట్టిపోయే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో కూరగాయ పంటలు లేక ధరలు అమాంతం పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మార్కెట్లో టమాటా మినహా ఏ కూరగాయ ధర చూసినా కిలో రూ.50 తక్కువగా లేదు. ఒకవేళ జూన్, జూలైలో వర్షాలు బాగా కురిసి పంటలు చేతికొచ్చే సరికి సెప్టెంబర్ దాటిపోతుంది. ఆ లోపు దిగుబడి లేక మార్కెట్లో కూరగాయ ధరలు భగ్గుమనే అవకాశం ఉంది.

అప్పులే మిగిలాయి



రూ.లక్ష పెట్టుబడి పెట్టి ఎకరా టమాటా, ఎకరా కాకర సాగు చేశా. నాలుగు బోరుబావుల్లోని నీళ్లు లేక పోవడంతో కాకర పూర్తిగా ఎండిపోయింది. టమాట కొద్దిగా ఉన్నా 25 కిలోల బాక్స్‌కు రూ.75 పలుకుతోంది. దీంతో ప్రయాణ చార్జీలు కూడా రావడం లేదు. పంటను చేనులోనే వదిలేశాం. పెట్టుబడికి చేసిన అప్పులే మిగిలాయి.

– కాశమల్ల రాములు, చౌదర్‌పల్లి

రోజురోజుకూ తగ్గుముఖం



ఎండల తీవ్రత దృష్ట్యా బోరుబావుల్లో భూగర్భజలాలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. మూడెకరాల్లో సాగు చేసిన బొప్పాయి, రెండున్నర ఎకరాల్లో వేసిన కూరగాయ పంటలు నీళ్లు అందక ఎండిపోతున్నాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రెండు నెలల్లో ఇంకెలా ఉంటుందోనని భయంగా ఉంది.

– అమీర్‌పేట బీరప్ప

పంట చేతికొచ్చే వరకు భయమే..



మూడెకరాల్లో బొప్పాయి, మూడెకరాల్లో కూరగాయలు సాగు చేశా. ఇందుకు రూ.రెండున్నర లక్షల పెట్టుబడి పెట్టా. రెండు బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయి. పంట చేతికొచ్చే వరకు నీళ్లు అందుతాయో.. లేదోనని భయంగా ఉంది. రెండెకరాల్లో వేసిన వాటర్‌మిలాన్ ఇప్పటికే సగం ఎండిపోయింది.

– ఆదిరెడ్డి రాజారెడ్డి, నస్దిక్‌సింగారం

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో కూరగాయల,ఆకుకూరల సాగు వివరాలు

మండలం	కూరగాయలు	ఆకుకూరలు (ఎకరాల్లో)
మాడ్గుల్	186	-
ఇబ్రహీంపట్నం	367	60
మంచాల	505	100
యాచారం	712	230
బాలాపూర్	101	80
అబ్దుల్లాపూర్‌మెట్	240	50
హయత్‌నగర్	8	-

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



షాద్‌నగర్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఘటన శనివారం తెల్లవారుజామున షాద్‌నగర్ పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ రాజేశ్వర్ తెలిపిన ప్రకారం.. పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో యమ్మీ హోటల్ ఎదురుగా సుమారు 40 ఏళ్ల వయస్సు ఉన్న ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చికిత్స పొందుతూ..



కిషన్ మృతదేహం

మీర్‌పేట: మానసిక ఆశ్రమంలో చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన ప్రకారం.. మీర్‌పేట ఠాణా పరిధి బాలాపూర్ చౌరస్తాలో ఈ నెల 3న మానసిక పరిస్థితి సరిగ్గా లేని ఓ గుర్తు తెలియని వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు అతడితో మాట్లాడగా తన పేరు కిషన్ (55) అని, ఇతర వివరాలు చెప్పలేదు. పోలీసులు కిషన్‌ను ఆలేటి మానసిక ఆశ్రమంలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న కిషన్ శనివారం మృతి చెందాడు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

కాలు జారి కిందపడిన వృద్ధుడు

మొయినాబాద్: ఇంట్లో కాలు జారి కిందపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి అంజయ్య(75) ఈ నెల 3న సాయంత్రం 5గంటల సమయంలో ప్రమాదవశాత్తు ఇంట్లో కాలు జారి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు అవడంతో వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గృహిణి అదృశ్యం


నర్సమ్మ(ఫైల్)

పహాడీషరీఫ్: మానసిక స్థితి సరిగా లేని గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆదిల్ల కృష్ణ భార్య ఆదిల్ల నర్సమ్మ(48)కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇంటి పట్టునే ఉంటుంది. ఏ పని చేయకుండా ఇంట్లోని ఉండమని గత నెల 20వ తేదీన ఆమెకు భర్త చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురై ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నర్సమ్మ ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మీర్‌పేట: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, ఆర్అండ్‌బీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల 23వ వార్షికోత్సవానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది పట్టభద్రులు ఈ కళాశాలలో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారని గుర్తుచేశారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదవాలని ఆయన సూచించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వేడుకలో కళాశాల కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం


సోడెక్స్-హో ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్: సోడెక్స్- హో ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సంస్థ ఏటా ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎంఎస్‌కే ఇంటర్నేషనల్ గ్రౌండ్‌లో నిర్వాహకులు సంజయ్‌గుప్తా, ఆనంద్‌కుమార్, రమేశ్, చిరంజీవి, రాంకీ, బి.శ్రీధర్ తదితరులు పోటీలను ప్రారంభించారు. ఆరు రోజులపాటు జరిగే పోటీల్లో 24 ఇంటర్నేషనల్ జట్లు పాల్గొననున్నాయని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపి.. ఉత్తమ ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించాలని ఆకాంక్షించారు.

యూరియా లారీ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు



కేశంపేట: యూరియా లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని అల్వాల శివారులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. యూరియా లోడ్‌తో హైదరాబాద్ వైపు నుంచి కేశంపేట గ్రామం వైపు ప్రయాణిస్తున్న లారీ తులవానిగడ్డ అలుగు సమీపంలోని మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నగరంలోని బోరబండకు చెందిన లారీ డ్రైవర్ షేక్ అయూబ్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ రాంచందర్, పైలెట్ అనిల్ అక్కడి డ్రైవర్‌ను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన పైన ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ

పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి


జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దేప భాస్కర్ రెడ్డి

పహాడీషరీఫ్: రాజ్యాంగాన్ని కించపరుస్తూ.. అంబేడ్కర్‌ను అవమానిస్తున్న బీజేపీ–ఆర్ఎస్ఎస్ వైఖరిని ప్రజలకు వివరించేందుకు కాంగ్రెస్ జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ నినాదంతో ముందుకు వెళ్తోందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఆదేశాల మేరకు జల్‌పల్లి మున్సిపాలిటీలో శనివారం సంవిధాన్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను చైతన్య పరిచారన్నారు. 11 ఏళ్లుగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపే ప్రయత్నాన్ని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలని గౌరవిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జై సంవిధాన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, జల్‌పల్లి నాయకులు షేక్ జహంగీరుద్దీన్, యాదగిరి, యూసుఫ్ ఖాద్రీ, యాదయ్య, భాస్కర్‌రెడ్డి, జగన్, ధన్‌రాజ్‌గౌడ్, శ్రీధర్, సుభాన్ యాదవ్, ఫజిల్ ఖాద్రీ, చంద్రమౌళి, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.